నమస్తే తెలంగాణ
హనుమకొండ
10 | వరంగల్, మంగళవారం 15 ఏప్రిల్ 2025 | HANUMAKONDA


బచ్చన్నపేట: నాగిరెడ్డిపల్లిలో అంబేద్కర్ విగ్రహం వద్ద నినదిస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రాజయ్య


రాయపర్తిలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నినాదాలు చేస్తున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

# జై భీమ్

- ఘనంగా అంబేద్కర్ జయంతి
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఘన నివాళులు

**భారతరత్న, రాజ్యాంగ నిర్మాత** డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ జయంతిని ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఊరూరా ఆయన విగ్రహాలకు పూలమాలల వేసి నివాళులర్పించారు. ఎక్కడికక్కడ అధికారికంగా ప్రభుత్వ కార్యాలయాలతో పాటు ఉత్సవ కమిటీలు, సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీలకతీతంగా నాయకులు పాల్గొన్నారు. పలుచోట్ల అంబేద్కర్ ఫ్లెక్సీతో ట్రాక్టర్‌లో ఊరేగిస్తూ డప్పుచప్పుళ్లు, కోలాటాల మధ్య ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు మాట్లాడుతూ రాజ్యాంగాన్ని రచించి దేశానికి దశ, దిశను నిర్దేశించిన అంబేద్కర్ ప్రపంచానికే ఆదర్శంగా నిలిచారని ఆయన ఏ ఒక్క వర్గానికి చెందిన వ్యక్తి కాదని.. యావత్ భారత్‌దేశ ఆస్తి అని పేర్కొన్నారు. ఆయన ఆలోచనలు, ఆశయసాధనకు ప్రతి ఒక్కరు పాటుపడాలన్నారు.

– నమస్తే నెట్‌వర్క్, ఏప్రిల్ 14

– వివరాలు లోపలి పేజీల్లో


దేవరుప్పుల చౌరస్తాలో మోహరించిన పోలీసులు


మహబూబాబాద్ రూరల్: ఘర్షణ పడుతున్న ప్రజా సంఘాల నాయకులు

## అంబేద్కర్ సాక్షిగా నిర్బంధం.. అవమానం..

*అంబేద్కర్ సాక్షిగా అధికారం అండతో దేవరుప్పులలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు నిర్బంధం, ఎమ్మెల్యే ఒత్తిడితో పోలీసులు ఓవరాక్షన్ చేయగా ములుగు, మానుకోట జిల్లాకేంద్రాల్లో జయంతి సభ ఏర్పాటుచేయకుండా కనీస ఏర్పాట్లు చేయకపోవడం, కలెక్టర్లు సహా జిల్లా ఉన్నతాధికారులెవరూ హాజరుకాకుండా అవమానాల మధ్య వేడుకలు నిర్వహించారని దళిత సంఘాలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయాచోట్ల ప్రొటోకాల్, ఏర్పాట్ల విషయంలో అధికారులు, సంఘాల నాయకుల మధ్య వాగ్వాదం జరుగగా, నిర్వహణ తీరుపై వారు ఆగ్రహం వ్యక్తంచేశారు.*

- దేవరుప్పులలో మాజీ మంత్రి ఎర్రబెల్లిని అడ్డుకున్న పోలీసులు
- ప్రొటోకాల్ పేరుతో ఖాకీల ఓవరాక్షన్
- మీరు పోలీసులా.. కాంగ్రెస్ ఏజెంట్లా : ఎర్రబెల్లి ఫైర్
- ములుగు, మానుకోటలో కలెక్టర్ రాకపోవడంపై దళిత సంఘాల ఆగ్రహం
- వేడుకల నిర్వహణ తీరుపై మండిపడ్డ నేతలు

దేవరుప్పుల, ఏప్రిల్ 14 : దేవరుప్పులలోని అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమం పోలీసుల నిర్బంధం, ఉద్రిక్తతల నడుమ సాగింది. ఉదయం నుంచే జనగామ డీసీపీ రాజమహేంద్ర నాయక్, వర్ధన్నపేట ఏసీపీ నర్సయ్య, పాలకుర్తి సీఐ మహేందర్‌రెడ్డి వందలాది మంది పోలీసులు ప్రొటోకాల్ పేర అంబేద్కర్ చౌరస్తాలో మోహరించారు. రోడ్డుపై నెలకొల్పిన ఈ విగ్రహ ఆవిష్కరణకు ప్రొటోకాల్ ఉంటుందని, స్థానిక ఎమ్మెల్యే యశస్వినీరెడ్డిని పిలువాలని, ఎర్రబెల్లితో విగ్రహాన్ని ప్రారంభిస్తే నిబంధనల ఉల్లంఘన కిందికి వస్తుందని విగ్రహ కమిటీకి తెలిపారు. ఈ క్రమంలో అక్కడికి చేరుకున్న ఎర్రబెల్లి మెట్ల మీద నుంచి విగ్రహం వద్దకు వెళ్లేందుకు పోలీసుల అడ్డుకోగా బీఆర్ఎస్ కార్యకర్తలు అమాంతం ఎత్తుకుని పైకి తీసుకెళ్లారు. విగ్రహ ప్రతిష్ఠాపన కమిటీ అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించగా, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పూలమాల వేసి నివాళులర్పించారు. దేవరుప్పులకు చెందిన బీఆర్ఎస్ పార్టీ దళిత కమిటీ రూ.12 లక్షల ఖర్చుతో ఈ విగ్రహాన్ని రెండేండ్ల కింద ఏర్పాటు చేసింది. ఇందులో రూ.8 లక్షల వ్యయంతో మాజీ మంత్రి ఎర్రబెల్లి కాంస్య విగ్రహాన్ని సమకూర్చారు. ఇతర దాతలతో విగ్రహ ఏర్పాటును పూర్తి చేశారు. ఎన్నికల కోడ్, ప్రొటోకాల్ ఉల్లంఘిస్తున్నారన్న కాంగ్రెస్ పార్టీ ఫిర్యాదులతో ఆవిష్కరణ వాయిదాపడుతూ వస్తున్నది. జయంతి రోజు సోమవారం విగ్రహాన్ని ఎర్రబెల్లితో ప్రారంభించాలని విగ్రహ కమిటీ నిర్ణయించగా, ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి ప్రొటోకాల్ నిబంధన ముందుకు తెచ్చి, ఇటు రెవెన్యూ, అటు పోలీసులపై ఒత్తిడి తేవడం వివాదానికి దారితీసింది.

***ఇది ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు : మాజీ మంత్రి ఎర్రబెల్లి***

దేవరుప్పులలో విగ్రహ కమిటీ తనను ఆహ్వానిస్తే పోలీసులు అడ్డుకోవడం విడ్డూరంగా ఉంది. అంబేద్కర్ రాసిన రాజ్యాంగానికి, ప్రజాస్వామ్యానికి ఇది గొడ్డలిపెట్టు. ఎమ్మెల్యే మాటలు విని పోలీసులు ఇంత నిర్బంధాన్ని ఏర్పాటు చేయడమేమిటి? ఏడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచి, మంత్రి పదవి చేసిన తనను పోలీసులు బలవంతంగా నెట్టివేస్తున్నారు. ఈ టార్చర్ తాను ఎన్నడూ చూడలేదు. పోలీసులు ఓవరాక్షన్ చేస్తున్నారు. ఏసీపీ మాటను తాను జవదాటలే. వాళ్లు చెప్పినట్టే నడుచుకున్నా. ఇదెక్కడి పద్ధతి. పాలకుర్తి సీఐ మహేందర్‌రెడ్డి కాంగ్రెస్ ఏజెంట్‌గా పనిచేస్తున్నారు. ఇప్పటికే దేవరుప్పుల మండలంలో అనేక మంది బీఆర్ఎస్ నాయకులపై కేసులు పెట్టారు. జైళ్లకు పంపారు. రాజకీయ అనుభవం లేని వారి మాటలు వింటే మీరే ఆగమవుతారు. నేను మళ్లీ గెలుస్తా.. మంత్రినవుతా. మంత్రిగా ఉన్న సమయంలో రాజకీయ ఒత్తిడి తెచ్చానా. పోలీసుల తీరు మారితే మంచిది. కాంగ్రెస్ సర్కార్‌కు ప్రజాస్వామ్యంపై, అంబేద్కర్ రాజ్యాంగంపై విశ్వాసం లేదు.

***ములుగులో రసాభాస***

ములుగు, ఏప్రిల్14(నమస్తే తెలంగాణ) : ములుగులో అంబేద్కర్ జయంతి కార్యక్రమం రసాభాసగా మారింది. అవమానాల మధ్య వేడుకలు జరిపారని, కలెక్టర్ సహా జిల్లా అధికారులు రాకపోవడం, సభ ఏర్పాటు చేయకపోవడంపై దళిత సంఘాల నాయకులు నిరసన వ్యక్తం చేశారు. వివరాల్లోకి వెళ్తే.. ములుగు కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ సంపత్‌రావు ఆధ్వర్యంలో అధికారికంగా నిర్వహించిన వేడుకకు దళిత సంఘాలతో పాటు ప్రజా సంఘాల నాయకులు, విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. సరిపడా కుర్చీలు లేకపోవడం, సమావేశ మందిరం అప్పటికే నిండిపోవడంతో లోపలికి అనుమతించలేదు. దీంతో దళిత సంఘాల నాయకులు ఇరుగు పైడి, జన్ను రవి, బుర్రి సతీశ్, నక్క భిక్షపతి, కోగిల మహేశ్, కొట్టెపాక ప్రభాకర్, చంటి భద్రయ్య, మడిపెల్లి శ్యాంబాబు, ప్రజా సంఘాల నాయకుడు ముంజాల భిక్షపతిగౌడ్ మండిపడ్డారు. కలెక్టర్ సహా అధికారులు రాకపోవడం అవమానించడమేనని మండిపడ్డారు. ఇటీవల జరిగిన పూలే, జగ్జీవన్‌రామ్ వేడుకల్లో సైతం కలెక్టర్ పాల్గొనలేదని అసహనం వ్యక్తంచేశారు. పక్కన ఉన్న భూపాలపల్లి జిల్లా కలెక్టర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేస్తే ములుగు కలెక్టర్ వేయకుండా వెళ్లారని, సీఎం సమావేశం ఉంటే అంబేద్కర్‌ను మరువడం ఏమిటని ప్రశ్నించారు. జయంతికి వాల్‌పోస్టర్ కాని, కరపత్రాలు కానీ ముద్రించలేదని, కేవలం తెల్ల పేపర్‌పై జిరాక్స్‌లు తీసి ఆహ్వాన పత్రాలను పంపారని ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రి సీతక్క నియోజకవర్గంలో ఇలా జరగడం అవమానకరమన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీల సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చినప్పుడు నిర్లక్ష్యంగా చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాగా అదనపు కలెక్టర్ స్పందించి విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు.

***మానుకోటలో ప్రొటోకాల్ వివాదం***

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం అంబేద్కర్ జయంతి ఉత్సవాల్లో ప్రొటోకాల్, కుర్చీల విషయంలో అధికారులతో వాగ్వాదం జరిగగింది. మొదట ప్రభుత్వ విప్ రామచంద్రు నాయక్, ఎమ్మెల్యే మురళీ నాయక్‌ను ఎస్సీ కార్పొరేషన్ డీడీ స్టేజీ పైకి ఆహ్వానించారు. బహుజనవాది వివేక్‌ను పిలుస్తున్న క్రమంలో దళిత సంఘాల నాయకులు ఆయనకు ఏం ప్రొటోకాల్ ఉన్నదంటూ అభ్యంతరం చెప్పారు. వివేక్‌ను స్టేజీ పైకి పిలువాల్సిందేనని గిరిజన నాయకులు పట్టుబట్టడంతో పిలిచి సమావేశం ప్రారంభించారు. ఈ క్రమంలో విప్, ఎమ్మెల్యేలు మాట్లాడి వెళ్తున్న క్రమంలో ఒక్కసారిగా సంఘాల నాయకులు తమ సమస్యలు ఎవరు వింటారని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీసం తమకు మాట్లాడే అవకాశం లేదా అని ప్రశ్నించడంతో ఘర్షణ వాతావరణం నెలకొన్నది. ప్రభుత్వ విప్ రామచంద్రు నాయక్ సర్ది చెప్పి మాట్లాడే అవకాశం కల్పించారు. ఉత్సవాలకు కలెక్టర్, అదనపు కలెక్టర్లు సమావేశానికి రాకపోవడంపై ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు బోడ రమేశ్‌నాయక్ స్పందించి కలెక్టర్‌ను బదిలీ చేయాలన్నారు. వారం తర్వాత అన్ని సంఘాల నాయకులతో సమావేశం ఏర్పాటు చేసి సమస్యలపై చర్చిస్తామని హామీ ఇచ్చారు.


ములుగు కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిరసన వ్యక్తం చేస్తున్న దళిత సంఘాల నాయకులు


దేవరుప్పుల: సమావేశంలో మాట్లాడుతున్న ఎర్రబెల్లి దయాకర్‌రావు

# మహాసభకు కదం తొక్కాలి

### రజతోత్సవాన్ని విజయవంతం చేయాలి

- గ్రామాల్లో పార్టీ జెండా ఎగరేసి రావాలి
- పాలకుర్తి నుంచి 25 వేల మంది తరలింపు
- సభ అనంతరం సభ్యత్వాలు, కమిటీల ఏర్పాటు
- సన్నాహక సమావేశాల్లో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



దేవరుప్పుల/హసన్‌పర్తి, ఏప్రిల్ 14 : హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో ఈ నెల 27న నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభకు కార్యకర్తలు కదంతొక్కాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పిలుపునిచ్చారు. శ్రేణులు స్వచ్ఛందంగా తరలిరావాలని, ఊరూవాడా కదిలిరావాలన్నారు. సోమవారం జనగామ జిల్లా దేవరుప్పుల మండల కేంద్రంలోని తిరుమల గార్డెన్‌తో పాటు హనుమకొండ చింతగట్టులోని బీజీఆర్ గార్డెన్‌లో నిర్వహించిన గ్రేటర్ వరంగల్ 55, 56, 65 డివిజన్ల ముఖ్య కార్యకర్తల సన్నాహక సమావేశాల్లో ఎర్రబెల్లి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ ఇచ్చిన ఛలో వరంగల్ పిలుపును నూటికి నూరు శాతం విజయవంతం చేయాలని శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ముందుగా గ్రామాల్లో పార్టీ జెండాను ఎగురవేసిన అనంతరం ర్యాలీగా తరలిరావాలన్నారు. పాలకుర్తి నియోజకవర్గం నుంచి 20 వేల మంది హాజరవుతారని అనుకుంటున్నప్పటికీ ఆ సంఖ్య పెరుగుతుందన్నారు. ఇక దేవరుప్పుల మండలం నుంచి 5 వేల మంది తరలివస్తారని శ్రేణులే చెబుతున్నారని అన్నారు. ఈ సభతో కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటుందో ఊడుతుందో తెలిసిపోతుందని, ఇప్పటికే అనేక సర్వేల్లో ఆ పార్టీ అట్టడుగులో ఉండగా, పాలకుర్తిలో బీఆర్ఎస్ హవా నడుస్తున్నదన్నారు. పాలకుర్తిలోఎక్కడ చూసినా కేసీఆర్ హయాంలో చేసిన అభివృద్ధి పనులే కనిపిస్తున్నాయని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి 16 నెలలవుతున్నా అభివృద్ధి శూన్యమన్నారు.

### బీఆర్ఎస్ పాలనలో వేగంగా అభివృద్ధి

తెలంగాణ సాధించిన కేసీఆర్ ముఖ్యమంత్రి కావడంతో ఇక్కడి అవసరాలు తెలిసిన వ్యక్తిగా రైతులకు సాగు నీరు, కరెంటు, ప్రజలకు మిషన్ భగీరథతో తాగు నీరు, మిషన్ కాకతీయతో చెరువుల మరమ్మతు చేపట్టడంతో పాటు అనేక జలాశయాలు నిర్మించారన్నారు. విద్య, ఉపాధి కల్పనతో పాటు అనేక సాఫ్ట్‌వేర్ కంపెనీలు హైదరాబాద్‌కు వచ్చాయన్నారు. రైతుబంధు, రైతు బీమా పథకాలతో అన్నదాత కుటుంబాలు సుభిక్షంగా ఉన్నాయన్నారు. ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి 16 నెలల పాలనలో రైతులతో పాటు అన్ని వర్గాలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రజతోత్సవ సభ అనంతరం పార్టీలో నూతనోత్సాహం వస్తుందని, కొత్త సభ్యత్వాలు తీసుకోవడంతో పాటు, పార్టీ అన్ని విభాగాల్లో నూతన కమిటీలు వేస్తారని ఎర్రబెల్లి పేర్కొన్నారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు తీగల దయాకర్, నాయకులు పల్లా సుందరరాంరెడ్డి, వీరారెడ్డి దామోదర్‌రెడ్డి, బబ్బూరి శ్రీకాంత్ గౌడ్, ఏల సుందర్, బస్వ మల్లేశ్, కారుపోతుల భిక్షపతి, ధరావత్ రాసింగ్, చింత రవి, గాంధీనాయక్, ఈదునూరి నర్సింహారెడ్డి, కత్తుల విజయ్‌కుమార్‌రెడ్డి, మైదం జోగేశ్వర్, కోతి ప్రవీణ్, వంగ అర్జున్, అంతోజు కృష్ణమూర్తి, కుతాటి నర్సింహులు, 65వ డివిజన్ కార్పొరేటర్ గుగులోత్ దివ్యరాణీరాజునాయక్, పలు డివిజన్ల అధ్యక్షులు భూక్యా సాంబయ్యానాయక్, అటికం రవీందర్, నాయకులు భూపాల్, పాడి మల్లారెడ్డి, విక్టర్‌బాబు, సూరం వాసుదేవరెడ్డి, శంకర్, శ్రీనివాస్, లక్ష్మణ్, మైఖేల్ రాజు, నాగరాజు పాల్గొన్నారు.


గీసుగొండ: సమావేశానికి హాజరైన పార్టీ నాయకులు, కార్యకర్తలు


అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

## కేసీఆర్ కృషితోనే టెక్స్‌టైల్ పార్కు

- నియోజకవర్గం నుంచి సభకు 20 వేల మందిని తరలిస్తాం
- బీఆర్ఎస్ పార్టీ సన్నాహక సమావేశంలో మాజీ ఎమ్మెల్యే చల్లా

గీసుగొండ, ఏప్రిల్ 14 : సీఎం కేసీఆర్ కృషితోనే గీసుగొండ మండలానికి టెక్స్‌టైల్ పార్కు వచ్చిందని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. సోమవారం గీసుగొండ మండలంలో సంగెం, గీసుగొండ మండలాలతో పాటు గ్రేటర్ వరంగల్ 15, 16, 17వ డివిజన్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల నాయకులతో బీఆర్ఎస్ రజతోత్సవ సభ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ధర్మారెడ్డి మాట్లాడుతూ రజతోత్సవ సభకు పరకాల నియోజకవర్గం నుంచి 20 వేల మందిని తరలిస్తున్నట్లు తెలిపారు. దళితులను ఆర్థికంగా అభివృద్ధి చేయాలని కేసీఆర్ దళితబంధు ఇస్తే పథకం తీసుకున్న వాళ్లే పార్టీ మారారని ఆవేదన వ్యక్తం చేశారు. టెక్స్‌టైల్ పార్కులో ఉద్యోగాల కోసం ఎవరి వద్ద వెళ్లవద్దని, కంపెనీ వెబ్ సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మండలంలో అడ్డగోలుగా మొరం తవ్వి తరలిస్తున్నా పోలీసులు మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మీకు తోడుగా ఉండి గెలిపించుకుంటానని బీఆర్ఎస్ శ్రేణులకు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్ గద్దె బాబు, డీసీ సీబీ డైరెక్టర్ దొంగల రమేశ్, మాజీ జడ్పీటీసీలు పోలీసు ధర్మారావు, గూడ సుదర్శన్‌రెడ్డి, మండల కార్యదర్శి వేణుగోపాల్‌రెడ్డి, నాయకులు బీ ప్రకాశ్, సీహెచ్ సదానందం, శివ, జీరాజయ్య, నాగేశ్వర్‌రావు. సారంగపాణి, రాజయ్య, సాగర్‌రెడ్డి, పీరాజు, యూత్ అధ్యక్షుడు శ్రీకాంత్, యూత్ నాయకులు ప్రమోద్, రాజేందర్, లెనిన్, ప్రసాద్, గజ్జి రాజు, కోటి, ధనుంజయ్, రాజు, రవీందర్‌రెడ్డి, నాగయ్య, రఘు పాల్గొన్నారు.

## ఎన్నికలెప్పుడొచ్చినా 100 సీట్లు మనవే..

- గులాబీ పండుగను విజయవంతం చేయాలి
- బీఆర్ఎస్ మానుకోట జిల్లా అధ్యక్షురాలు కవిత, మాజీ ఎమ్మెల్యే రెడ్యా నాయక్


దంతాలపల్లి: సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్

నర్సింహులపేట/దంతాలపల్లి, ఏప్రిల్ 14 : రాష్ట్రంలో ఎన్నికలు ఎప్పుడొచ్చినా బీఆర్ఎస్ 100 సీట్లు గెలుస్తుందని పార్టీ మహబూబాబాద్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎంపీ మాలోత్ కవిత, డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో వార్ వన్‌సైడ్ కావాలన్నారు. సోమవారం దంతాలపల్లి మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన సన్నాహక సమావేశంలో వారు పాల్గొన్నారు. అలాగే నర్సింహులపేటలోని శ్రీవెంకటేశ్వర గార్డెన్‌లో జరిగిన సమావేశానికి రెడ్యా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 14 ఏండ్లు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని కొనసాగించి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించిన కేసీఆర్, పదేండ్లు తెలంగాణను అభివృద్ధి పథంలో నడిపించారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన 16 నెలల్లోనే ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కొంటున్నదన్నారు. ఈ నెల 27న ఎల్కతుర్తిలో నిర్వహించే రజతోత్సవ సభకు బీఆర్ఎస్ అభిమానులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గం నుంచి 10 వేల మంది సభకు హాజరుకానున్నట్లు తెలిపారు. అనంతరం చలో వరంగల్ వాల్ పోస్టర్లను రెడ్యా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కవిత సూర్యాపేట రోడ్డులో బహిరంగ సభకు సంబంధించిన వాల్ రైటింగ్ చేశారు. కాగా, గ్రామానికి చెందిన బాద అనిల్ బహిరంగ సభ కోసం 50 కేజీల బియ్యం అందజేశారు. ఆ పిదప అంబేద్కర్ చిత్ర పటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. సమావేశంలో జడ్పీ మాజీ వైస్ చైర్మన్ నూకల వెంకటేశ్వర్‌రెడ్డి, పార్టీ దంతాలపల్లి మండలాధ్యక్షుడు ధర్మరాపు వేణు, మాజీ ఆర్‌బీసీ కో ఆర్డినేటర్ వొలాద్రి మల్లారెడ్డి, యూత్ మండలాధ్యక్షుడు వీరబోయిన కిషోర్‌కుమార్, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, గౌతమ్‌రెడ్డి, మాలోత్ వినోదా శ్రీనివాస్, నర్సింహులపేట మండల అధ్యక్షుడు మైదం దేవేందర్, మాజీ వైస్ ఎంపీపీ జాటోత్ దేవేందర్, సత్తిరెడ్డి, భిక్షంరెడ్డి, సువీర్‌రెడ్డి, రమేశ్, జగదీశ్వర్, నర్సింహారెడ్డి, ఖాజా మియా, వీరన్న, వంశీ, కాలు, రామన్న, మధురెడ్డి, అనిల్, యాకన్న, శ్రీశైలం, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.


దంతాలపల్లి: వాల్ రైటింగ్ చేస్తున్న మాజీ ఎంపీ కవిత

## పంటలు పరిశీలించి.. రైతులకు ధైర్యం చెప్పి

- మంత్రి, ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడిన ఎమ్మెల్యే పల్లా
- అకాల వర్షానికి నష్టపోయిన వారికి ఎకరాకు రూ.10 వేలివ్వాలి
- వ్యవసాయ అధికారులతో కలిసి పంటల పరిశీలన


సిద్దెంకిలో వడగండ్లకు ధాన్యం రాలిపోయిన పంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

జనగామ రూరల్, ఏప్రిల్ 14 : జనగామ మండలంలోని ఎల్లంల, పెంబర్తి, సిద్దెంకి గ్రామాల్లో వడగండ్ల వానతో తీవ్రంగా నష్టపోయిన వరి పంటలను సోమవారం వ్యవసాయ అధికారులతో కలిసి ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి పరిశీలించి రైతులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. పంట నష్టంపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు, ప్రిన్సిపల్ సెక్రటరీ రఘునందన్ రావుతో పాటు కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్‌తో ఫోన్‌లో మాట్లాడి నష్టంపై వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ వడగండ్లకు నేలరాలిన రైతులకు ఎకరాకు రూ.10వేలు నష్టపరిహారం అందించాలన్నారు. ఇప్పటికే సాగునీరు అందక పెద్ద ఎత్తున పంటలు ఎండిపోయాయని, ఇప్పుడు అకాల వర్షంతో పాటు వడగండ్లతో తీవ్రంగా రైతులు నష్టపోయారన్నారు. వరి పంటే కాకుండా మామిడి, బొప్పాయి, బత్తాయి, సపోటా తదితర పంటలు గాలి దుమారంతో పూర్తిగా నేలరాలాయని, వారిని కూడా ఆదుకోవాలని అధికారులకు సూచించారు. వడగండ్ల వల్ల దెబ్బతిన్న పంటలను పూర్తిస్థాయిలో సర్వే చేసి ప్రభుత్వానికి అందజేయాలని అధికారులను కోరారు. రైతులకు నష్టపరిహారం కోసం తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి రామారావునాయక్, ఏడీఏ బీనా, ఏఈవో రిషిత, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బాల్దె సిద్దిలింగం, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బైరగోని యాదగిరి గౌడ్, రైతుబంధు సమితి మండల మాజీ కోఆర్డినేటర్ బురెడ్డి ప్రమోద్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి నిమ్మల స్వామి, సర్పంచుల ఫోరం మండల మాజీ అధ్యక్షురాలు బొల్లం శారద, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు ఎర్ర సుజాత, రవి, గ్రామ శాఖ అధ్యక్షులు మడిపల్లి సుధాకర్ గౌడ్, చినబోయిన నర్సయ్య, శ్రీను, నాయకులు దయాకర్, నర్సింగ్, పుప్పాల మల్లయ్య, కరుణాకర్, బోళ్ల ఆంజయ్య, బీదని రవీందర్, కవిడే నగేశ్, మడిపల్లి శ్రీనివాస్, గాజుల నరేశ్‌యాదవ్, సుధాకర్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, బాలకృష్ణారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

## కాళేశ్వరం వెళ్లి వస్తూ.. రోడ్డు ప్రమాదంలో ముగ్గురి మృతి

- లారీని కారు ఢీకొన్న ఘటనలో మరో ముగ్గురికి గాయాలు

స్టేషన్ ఘన్‌పూర్, ఏప్రిల్ 14 : కాళేశ్వరం వెళ్లి వస్తూ రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి చెందిన ఘటన స్టేషన్ ఘన్‌పూర్ మండలం రాఘవాపూర్ శివారు జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అమలాపురానికి చెందిన సత్తి రాజేశ్వర్ రావు, అనంతలక్ష్మి కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని గాజుల రామారంలో ఉంటున్నారు. వీరి కుమారుడు సత్తి శ్రీను సివిల్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు. కాగా రాజేశ్వర్‌రావు, అనంతలక్ష్మి, కుమారుడు శ్రీను (45), కోడలు రమణకుమారి (42), మనుమడు అరవింద్, మనుమరాలు అనూష(22) కారులో కాళేశ్వరానికి వెళ్లి వస్తున్నారు. ఈ నేపథ్యంలో స్టేషన్ ఘన్‌పూర్ మండలం రాఘవాపూర్ శివారు జాతీయ రహదారిపై సోమవారం సాయంత్రం సుమారు 5 గంటల ప్రాంతంలో ముందు వెళ్తున్న లారీని ఢీకొట్టారు. దీంతో శ్రీను, రమణకుమారి, అనూష అక్కడికక్కడే మృతి చెందారు. రాజేశ్వర్ రావు, అనంతలక్ష్మి, అరవింద్‌లకు తీవ్ర గాయాలు కాగా, వారిని జనగామ ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందన్నారు. విషయం తెలుసుకున్న స్టేషన్ ఘన్‌పూర్, రఘునాథపల్లి సీఐలు జీ వేణు, శ్రీనివాస్ రెడ్డి, ఎస్సైలు వినయ్ కుమార్, బండి శ్రవణ్ కుమార్, నరేశ్, పోలీస్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని సుమారు గంటన్నర పాటు శ్రమించి మృతదేహాలను అంబులెన్స్‌లో జనగామ ఏరియా ఆసుపత్రికి తరలించారు.ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా చూశారు. కాగా, లారీ డ్రైవర్ పారిపోయాడు. జనగామ డీసీపి రాజమహేంద్రనాయక్, ఏసీపి భీంశర్మ ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు.


ఘటనా స్థలం వద్ద సహాయక చర్యల్లో పోలీసులు, గుమికూడిన స్థానికులు, ప్రయాణికులు